క్లుప్తంగా

పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



బంటుమిల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి మంగళవారం బంటుమిల్లి, చినపాండ్రాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీలను) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో, వైద్య సిబ్బందితో సమీక్షించి వారి పరిధిలోని ఆస్పత్రుల వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి పీహెచ్‌సీలలో నమోదవుతున్న కేసుల పరిస్థితిని పరిశీలించారు. ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్న కుష్ఠువ్యాధి ఇంటింటి సర్వేపై వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్ కుమార్, సోనియా నారాయణ్, సూర్యతేజ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి నిధుల కేటాయింపుపై హర్షం



అవనిగడ్డ: కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు నిధులు కేటాయించినందుకు స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపుతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంపూర్ణ సహకారం, విశాఖపట్నం – చెన్నై మధ్య ఇండస్ట్రియల్ కారిడార్, ఆక్వా సాగు ప్రోత్సాహంకు నిధులు కేటాయించడం మంచి పరిణామం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కృషి ఫలితంగానే పెద్ద ఎత్తున నిధుల కేటాయింపులు జరిగాయని, అందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు.

రేపు పెడనలో జాబ్ మేళా

పెడన: పట్టణంలోని శ్రీవిజయానంద డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగ మల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ జాబ్ మేళాకు పది కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ లు హాజరవుతారని పేర్కొన్నారు. సుమారు 870 ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీటెక్ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు మధ్య ఉన్న యువతీయువకులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చునని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 70957 00620, 94930 18225 లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

బాలగంగాధర తిలక్‌కు ఘన నివాళి



మచిలీపట్నంటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు బాలగంగాధర తిలక్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గొడుగుపేటలో నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో బాల గంగాధర తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, వి.సుబ్బారావు, సీహెచ్ మల్లేశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్యం, వి.రాజశేఖర్, మురళీకృష్ణ, ప్రసాద్, శివయ్య, నీరజ పాల్గొన్నారు. స్థానిక వల్లెగూడెంలోని అజ్మీర్‌బాబా దర్గా సేవా సమాజం ఆధ్వర్యంలో బాలగంగాధర తిలక్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నాగేశ్వరరావు, వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్, బాలగంగాధర తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, సయ్యద్‌బాజీ, షేర్ అలీ, మారుతి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

26న శాకంబరీ దేవిగా పైడమ్మ

పెడన: పట్టణంలో ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారిని ఈ నెల 26న శాకంబరీ దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈవో టీవీవీ మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అమ్మవారికి పండ్లు, కూరగాయలు ఇవ్వదల్చినవారు 25వ తేదీ సాయంత్రంలోగా సమర్పించాలన్నారు.

పేదలపై ఉక్కుపాదం..పెద్దలపై ఉదాసీనత



నిబంధనలు పేదలకు మాత్రమే వర్తిస్తాయి... వారు పొట్టకూటి కోసం రోడ్డు మీద ఏదో చిన్న షెడ్డు వేసుకుని వ్యాపారం చేసుకున్నా అధికారులు జేసీబీలతో కూల్చేస్తారు.ఎందుకంటే పేదలంటే చులకన...పెద్దలు చట్టాన్ని అడ్డంగా అతిక్రమించినా...చూసీచూడనట్టు పోతారే తప్ప కనీసం నోటీసులు ఇచ్చే సాహసం కూడా చేయరు. నగరపాలక సంస్థ అధికారులు సోమవారం దగ్గరుండి మరీ బస్టాండ్ సెంటరు నుంచి జిల్లా కోర్టు సెంటరు వరకు రోడ్డు మార్జిన్‌లో పండ్లు, పూలు, కూరగాయలు అమ్మే చిన్న వ్యాపారుల దుకాణాలను ఉక్కుపాదం మోపి తొలగించిన విషయం విదితమే. అయితే నగరంలోని మాచవరంలో నూతనంగా నిర్మించిన ఓ షాపింగ్‌మాల్ నిర్వాహకులు బైపాస్‌రోడ్డులో మార్జిన్‌ను పూర్తిస్థాయిలో ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు. పైగా ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న స్థలంలో మాల్‌కు వచ్చే వారు వాహనాలు నిలిపితే రూ.500 జరిమానా కట్టాలని మాల్ నిర్వాహకులు బోర్డులు పెట్టి మరీ ఫైన్ వసూలు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. –మచిలీపట్నంటౌన్

పరిశ్రమల ఏర్పాటుకు భూముల కేటాయింపు వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు అలినేషన్, మ్యుటేషన్ ప్రక్రియకు ప్రతిపాదనలను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. చల్లపల్లి, వీరపనేనిగూడెం, మల్లవల్లి, గంగాధరపురం, గుడివాడలలో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా అవసరమైన భూముల సేకరణ కోసం అలినేషన్, మ్యుటేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే 22ఏ పరిధి నుంచి భూములను తొలగించేందుకు కూడా ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ ఆర్డీవోలు ఎం.వాణి, పి.పద్మావతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఉద్యోగులు



యోగాసనాలు వేస్తున్న మహిళా ఉద్యోగులు

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జిల్లా అధికారులు, ఉద్యోగులకు ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పూర్వం అందరూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించి, ఎంతో ఆరోగ్యంగా ఉండేవారన్నారు. నేడు పర్యావరణం చాలా కలుషితమైందని, మన జీవనశైలిలో కూడా చాలా మార్పులు వచ్చాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆరోగ్యం మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగులు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతూ ఉంటారని, యోగా అభ్యసించటం వల్ల మానసిక ప్రశాంతత లభించి విధి నిర్వహణలో సులువుగా పనిచేయగలుగుతారన్నారు. యోగా గురువులు మద్దాల చింతయ్య, శీలం రమేష్, రేఖ, జిల్లా అధికారులు, ఉద్యోగులకు చలన క్రియలు, వజ్రాసనం, కపాలభాతి, నాడీశోధన, ప్రాణాయామం వంటి ఆసనాలను నేర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, జిల్లా క్రీడల అధికారి ఝాన్సీలక్ష్మి, విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు, సమాచార పౌర సంబంధాలశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

వివాదంలో ఉన్న భూమిని పరిశీలించిన ఎస్సీ కమిషన్ చైర్మన్



చినగొల్లపాలెంలో భూ వివాదంపై వివరాలు తెలుసుకుంటున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

కృత్తివెన్ను: మండల పరిధిలోని చినగొల్లపాలెం గ్రామంలో రెండు కులాల మధ్య నెలకొన్న భూవివాదంపై సంబంధిత ప్రాంతాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. రెండు వర్గాలకు సంబంధించిన వారితో చర్చించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాల క్రితం సముద్ర తీరానున్న అన్ సర్వే ల్యాండ్‌ను ఎస్సీ వర్గానికి చెందిన వారు పంచుకున్నారని, ఆ భూమిని ఎస్సీయేతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదుపై క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చానన్నారు. ఇరువర్గాలతో మాట్లాడానని, దీనిపై రెవెన్యూ అధికారులతో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఈ పరిశీలనలో మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, డీఎస్పీ అబ్దుల్ సుభాని, స్థానిక రెవెన్యూ అధికారులు, స్థానికులు ఉన్నారు.

ఉద్యాన పంట సాగులో మురుగు నీరు తొలగించాలి



కోసూరువారిపాలెంలో అరటి తోటలు పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

కోసూరువారిపాలెం(మోపిదేవి): ఉద్యాన పంటలు ప్రధానంగా మిరప, బొప్పాయి, అరటి, పసుపు, కంద, బీర, చెరకు వంటి పంటల సాగులో మురుగునీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి రైతులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఉద్యాన శాఖాధికారులు పలురకాల ఉద్యాన పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా అధికంగా కురిసిన వర్షాల కారణంగా పంటల ప్రస్తుత పరిస్థితిని గమనించినట్లు తెలిపారు. అధిక వర్షాల వల్ల పంటలకు మురుగు నీటి పారుదల సౌకర్యం కల్పించాలని, నీటిని నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. మిరప పంటలో పైపాటుగా 50 కిలోల యూరియా, 25 కిలోల ఎంటీపీ, 100 కిలోల వేప పిండిని వేయాలని సూచించారు. కందలో ముందస్తు జాగ్రత్తగా నేల కాండం మొక్కలపై కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బొప్పాయి మొక్కలు వైరస్ తెగులు తట్టుకునే విధంగా సమగ్ర సస్య రక్షణతో పాటు సూక్ష్మధాతు మిశ్రమం 5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వై.పద్మావతి, ఉద్యాన అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్ కాలనీ రోడ్డు నిర్మించండి

నాగాయలంక: గ్రామంలోని అంబేడ్కర్ నగర్ కాలనీ దళితవాడ, హైస్కూలు రోడ్డు తక్షణం నిర్మించాలని స్థానిక బీసీ, దళిత సంఘాల నాయకులు లకనం నాగాంజనేయులు, చీరాల తుఫాన్, ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాసప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మెయిన్ రోడ్డు నుంచి నాగాయలంక హైస్కూలు రోడ్డు గుంతలు పడి పూర్తిగా ధ్వంసం అయిందని, ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులు వర్షాలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సమగ్ర నివేదికను సిద్ధం చేయండి

కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలోని మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసి అందజేయాలని కలెక్టర్ డీకే బాలాజీ ఢిల్లీ ప్రతినిధులను కోరారు. నగరంలో మురుగునీటి వ్యవస్థను, డ్రెయినేజీలను పరిశీలించేందుకు మంగళవారం ఢిల్లీ నుంచి కేంద్ర ప్రజారోగ్య, పర్యావరణ ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వారు కలెక్టర్ బాలాజీని కలిసి వివరాలను అందజేశారు. ఢిల్లీ ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే మచిలీపట్నం నగరం అంతా మురుగుకాలువలు పొంగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ పరిస్థితిని నియంత్రించడానికి వీలైనంత త్వరగా ప్రాజెక్టును తయారుచేసి అందివ్వాలన్నారు. మచిలీపట్నంతో పాటు తాడిగడప మునిసిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కేంద్ర బృందం సభ్యులు ఆరిత్రాదాస్, చీఫ్ ఇంజినీర్ ఆంజనేయులు, ఎస్ఈ శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల ద్వారానే ఎరువులు

మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏ రమాదేవి



గూడూరు: ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ సహకార సంఘాలు ఎరువుల అమ్మకాలలో కీలక పాత్ర పోషించాలని మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏ ఎస్.రమాదేవి కోరారు. గూడూరు మండలంలోని సహకార సంఘ కార్యదర్శులతో ఎరువుల అమ్మకాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. గూడూరు సహకార సంఘ ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ సొసైటీలలో అన్ని రకాల ఎరువులను ఉంచాలని, తప్పనిసరిగా స్టాక్ బోర్డులో ఎరువుల వివరాలు, వాటి ధరలు, ఎంత స్టాక్ వున్నది తెలిసేలా ఉంచాలన్నారు. వ్యాలిడిటీ వున్న, లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు, రైతులకు సంతకంతో కూడిన రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్ కచ్చితంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్, వీఏఏలు ప్రభాకర్, ఈశ్వర్, ప్రవీణ్, పవన్, సొసైటీల సీఈవోలు చక్రవర్తి, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆసిఫ్ హుస్సేన్ అన్నారు. విద్యాలయంలో నూతన విద్యావిధానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాలు పెంపొందించుట అనే అంశాలపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థుల్లో కనీసం చదవటం, రాయటం లాంటి నైపుణ్యాలు కొరవడుతున్నాయని, వాటిని పెంపొందించటమే కార్యశాల లక్ష్యమన్నారు. ఉత్తమ బోధన, నిత్య పుస్తక పఠనం, రాయటం వల్ల విద్యలో వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావచ్చునన్నారు. విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు జె.గ్లోరీ స్వరూపరాణి బోధనలో మెలకువలను వివరించారు. విద్యార్థులు నాటికలు ప్రదర్శించి, కథలు చెప్పి ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో పీజీటీ ఆర్.విజయ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

గూడూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు మంగళవారం కంకటావ సచివాలయంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో ఆధార్ కార్డుల నమోదు సవరణలు చేపట్టారన్నారు. 24న కంకటావ, 25న ఆర్పేపల్లి, 26న గురిజేపల్లి, 27న కల్పటం గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి

ఎంపీడీఓ మారుతీ శేషమాంబ



ఆధార్ క్యాంపును ప్రారంభించిన ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ

ఘంటసాల: ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎం.మారుతీ శేషమాంబ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఐదు రోజుల ఆధార్ క్యాంపుల్లో భాగంగా ఘంటసాల గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మతో కలసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి, ఇతర అవసరాలకు ఆధార్ కార్డు తప్పనిసరి అవుతుందన్నారు. అందువల్ల గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు అందించాలని ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి శనివారం వరకు ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. అనంతరం ఆధార్ క్యాంపులో అందిస్తున్న సేవల వివరాలను తెలుసుకుని సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ కేజే శ్రీనివాస్ చంద్, ఈవో టి.విజయలక్ష్మి, ఎం.శివగంగ, ఎల్.నాగ పద్మారావు, ఎల్.పావని, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించాలి



మురుగు కాలువల్లో పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య

పెడన: మురుగు కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించి నీరు సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. పట్టణంలోని పూర్ణచంద్రరావు కాలనీని మంగళవారం ఉదయం ఆయన సందర్శించి మురుగునీటి పారుదలను పరిశీలించారు. ప్రధాన మురుగు కాలువలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి ఉండటాన్ని చూసి, వాటిని తక్షణం తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చూస్తామని చెప్పారు.

ముంపు ప్రాంతం పరిశీలన

పట్టణంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రామలక్ష్మీ వీవర్స్ కాలనీలోని పలు అంతర్గత రహదారులపై వర్షం నీరు నిలిచి ఉండటాన్ని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పరిశీలించారు. తక్షణం నీరు బయటకు పోయేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే మోటారు ఇంజన్లను ఏర్పాటు చేసి నీరు బయటకు పోయేలా చూడాలని సూచించారు.

దేవరకోటలో పంట పొలాల పరిశీలన

దేవరకోట(ఘంటసాల): అధిక వర్షాల తర్వాత నీట మునిగిన వరి నాట్లు, నారుమడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి మంగళవారం ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో పర్యటించి వరి నారుమడులు, వెదజల్లిన పొలాలు, నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మురళీ కృష్ణ మాట్లాడుతూ కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జలవనరుల, డ్రైనేజీ, వ్యవసాయ శాఖ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల సమన్వయంతో సకాలంలో పంట కాలువలు, మురుగు కాలువలు పరిశుభ్రం చేయడం వల్ల పంట పొలాలు ముంపు సమస్య నుంచి రక్షించుకోగలిగామని తెలిపారు. ఏఆర్ఎస్ శాస్త్రవేత్త పద్మావతి మాట్లాడుతూ రైతులు అధిక వర్షాల వల్ల వరి నారుమడుల్లో నీరు బయటకు తీసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ చల్లుకోవడం ద్వారా నారుమడి త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ వరి నారుమడులలో ఇనుము ధాతువు లోపం కనిపిస్తోందని, దీని నివారణకు వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు అన్నభేది, నిమ్మ ఉప్పు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వీఏఏ సత్యదేవ్, రైతు వేమూరి రత్నగిరి, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు

పెడన: నూతన విద్యా విధానంలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు భాషపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇవ్వనున్నట్టు పెడన ఎంఈవో–2 ఎ.హరనాథ్ తెలిపారు. స్థానిక బంగ్లా స్కూలులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో హరనాథ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పునాది అభ్యసన కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాభివృద్ధి విజయవంతంగా అమలు చేయడానికి విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ భాషను స్వేచ్ఛగా ఉపయోగించుకునేందుకు అత్యంత అనుకూలమైన ప్రదేశం మన పాఠశాలేనని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి మన పోస్టాఫీస్.. ఇప్పుడు ప్రతి గడపలో

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో ఈ నెల 24వ తేదీ నుంచి మన పోస్టాఫీస్.. ఇప్పుడు ప్రతి గడపలో.. కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కత్తి ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి సెప్టెంబర్ నెల వరకు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఆదేశాలు వచ్చాయన్నారు. దీనిలో భాగంగా మచిలీపట్నం డివిజన్ పరిధిలోని మచిలీపట్నం నగరంతో పాటు నందమూరులోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలకు వారి ఇంటికి వెళ్లి పొదుపు ఖాతాలు, గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఐపీపీబీ ఖాతాలు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, బాల ఆధార్ సేవలు అందిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు హెడ్ పోస్టాఫీస్‌లో పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. నగరప్రజలు ఈ సదస్సుకు హాజరై పొదుపు ద్వారా వారి పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని ఆయన కోరారు.

ఎంపీడీవో రమణారావు మృతికి నివాళి

చిలకలపూడి(మచిలీపట్నం): నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణారావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా పరిషత్ యూనిట్ మంగళవారం నివాళులర్పించింది. విజయవాడ మధురానగర్‌లోని ఏలూరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న దురదృష్టకర సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.హేమప్రకాష్ డిమాండ్ చేశారు. సున్నితమైన మనసున్న వ్యక్తి రమణారావు అని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, రమణారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా పరిషత్ యూనిట్ సభ్యులు పడమట భాస్కర్, బి.శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. సదస్సులో మండల వ్యవసాయాధికారి కె. హెప్సీబారాణి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయంలో ఎటువంటి సమాచారం అయినా పొందవచ్చునని తెలిపారు. అర్జీదారుకు 30 రోజుల లోపు సంబంధిత అధికారి సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారిపై జిల్లా అధికారికి అప్పీలు పెట్టుకోవచ్చని తెలిపారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు అనుచితం

నాగాయలంక: కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగాలలో వికలాంగుల కోటాపై ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు అనుచితమని కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత చెన్ను రంగారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను ఆమె ఉపసంహరించుకుని తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.